ప్రజాశక్తి
శనివారం 2 ఆగస్టు 2025
5
శ్రీ సత్యసాయి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

లింగ నిర్ధారణకు పాల్పడితే చర్యలు

కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

లింగ నిర్ధారణకు పాల్పడే వారిపై కేసులు నమోదు చేయాలని కలెక్టర్ టిఎస్.చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్లో గర్భస్థ శిశు నిర్ధారణ పరీక్షల నిర్మూలన జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లింగ నిష్పత్తిలో అసమానతలను తొలగించి సమాజంలో ఆడపిల్లల శాతాన్ని పెంచాలన్నారు. స్కానింగ్ సెంటర్లు, ఆసుపత్రుల్లో లింగ నిర్ధారణ హత్యలు చేయడం, ఆడపిల్లలు వద్దంటూ కుటుంబంలో ఎవరైనా వేధింపులకు గురి చేస్తుంటే పూర్తి ఆధారాలతో కేసులు నమోదు చేయాలన్నారు. క్రిమినల్ కేసులతోపాటు కఠిన శిక్ష పడే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్కాన్ సెంటర్లు, నర్సింగ్ హోమ్‌లు ప్రయివేటు ఆసుపత్రులపై నిరంతరం తనిఖీలను సంబంధిత అధికారులు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఒ డాక్టర్ ఫిరోజ్ బేగం, డీఎస్పీ ఆదినారాయణ, ఐసిడిఎస్ పీడీ కల్పన పాల్గొన్నారు.

కేంద్ర బందం గుర్తించిన లోటుపాట్లను సరిదిద్దాలి

గ్రామీణ అభివృద్ధి పనులపై కేంద్ర బృందం గుర్తించిన లోటుపాట్లను, సరిదిద్దుకోవాలని కలెక్టర్ టిఎస్.చేతన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్లో కేంద్ర బందంతో కలెక్టర్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు. గత నెల 25 నుంచి ఈనెల 1వ తేదీ వరకు జిల్లాలో కేంద్ర బందం ప్రకటించిన నేపథ్యంలో కలెక్టరేట్లో సమావేశం జరిగింది. కేంద్ర బందం ప్రతినిధి దయాకర్ రెడ్డి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం, పీఎం ఏవైజీ, ఎన్ఎస్ఎం తదితర పథకాలు అమలు బాగా ఉన్నాయని, చిన్నచిన్న లోటుపాట్లు ఉన్నాయని వివరించారు. వాటిని సరిచేసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో కేంద్ర బందం సభ్యులు చూడామని, డ్వామా పీడీ విజయేంద్ర ప్రసాద్, డిపిఒ సమత, భూగర్భ జల శాఖ ఏడీ రాజశేఖర్ పాల్గొన్నారు.

పెనుకొండ దర్గా కూడలిలో రెండు వరుసల రహదారిని తలపించేలా ఉన్న నాలుగు వరుసల రహదారి

పేరుకే నాలుగు వరుసలు.. తప్పని ట్రాఫిక్ కష్టాలు..!

◆ రోడ్లుపైనే వాహనాల నిలుపుదల
◆ పెనుకొండలో వాహదారుల ఇబ్బందులు
◆ ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో అధికారులు విఫలం
◆ ప్రధాన రహదారిపై ప్రమాదాలకు ఆస్కారం

శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ ప్రాంతంలో ఇటీవల పారిశ్రామిక రంగం అభివృద్ధి చెందింది. దీనికి తోడు అటు బెంగుళూరు.. ఇటు హైదరాబాద్‌కు వెళ్లే వాహనాలు పెనుకొండ మీదుగానే వెళ్లాల్సి ఉంది. ఈ నేపథ్యంలో వాహనరాకపోకల రద్దీ పెరిగింది. నిత్యం వందలాది వాహనాలు, వేలాది మంది కార్మికులు, ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. వాహనరాకపోకలకు సరపడా పట్టణంలో రహదారులు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నిత్యం వాహన రద్దీతో పట్టణ ప్రాంతం ట్రాఫిక్‌తో నిండిపోతోంది.

ప్రజాశక్తి-పెనుకొండ

పెనుకొండ పట్టణం నుంచి వెళ్లే పాత జాతీయ రహదారి (ఎన్‌హెచ్-7)ను నాలుగు లైన్ల రోడ్డుగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం రూ.20 కోట్ల నిధులు విడుదల చేసింది. గత ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న మాలగుండ్ల శంకరనారాయణ ఈ పనులకు భూమి పూజ చేసి ప్రారంభించారు. ఆదిలోనే హంసపాదు అన్నట్లుగా పనులు ప్రారంభంలోనే పలు అడ్డంకులు ఎదురయ్యాయి. రోడ్డు వెడల్పు చేయాలంటే దారికి అనుకున్న ఉన్న కట్టడాలను తొలగించాల్సి ఉంది. జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న దుకాణాలు, భవనాల యజమానులతో సమావేశం నిర్వహించి వారికి నచ్చజెప్పాల్సి ఉండగా ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. దీంతో రోడ్డు పనులు ప్రారంభ సమయంలో పలువురు భవనాల కూల్చివేతలను అడ్డుకున్నారు. ఫలితంగా నాలుగు వరుసల రోడ్డు వంకర టింకరగా మారింది. పేరుకే నాలుగు వరుసల రహదారి అయినా పెనుకొండలలో ఈ దారి ఎక్కడా సవ్యంగా కన్పించదు. వాహనాల రాకపోకల సమయంలో గమనిస్తే ఇది రెండు వరుసల రహదారి కంటే అధ్వానంగా కనిపిస్తుంది. ప్రధాన కూడళ్లలో రోడ్డు వెడల్పు చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారనే విమర్శలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి.

120 అడుగులుంటే 80అడుగుల రోడ్డు నిర్మాణం

పెనుకొండలో రికార్డుల ప్రకారం రోడ్డు 120 అడుగులుంది. అధికారుల ఆలసత్వం, ప్రజాప్రతినిధుల ధన వ్యామోహంతో ఒక్కొక్క చోట ఒకరకంగా రోడ్డు విస్తరణలో జరిగింది. కొన్ని చోట్ల80 అడుగులుంటే మరికొన్ని చోట్ల 90అడుగులు ఇలా ఇష్టారాజ్యంగా రోడ్డు నిర్మాణం చేశారు. రోడ్డుకు ఇరువైపులా ఆరు అడుగులు డ్రెయినేజీకి కేటాయించగా మిగిలిన 74 అడుగులలో నాలుగు వరుసల రహదారిని ఏర్పాటు చేశారు. ఈ రోడ్డులో ఇరువైపులా నాలుగు వాహనాలు ఒకేసారి రాకపోకలు సాగించలేవు. నాలుగు వరుసల రహదారిలో డ్రైనేజీపైనే భవనాల కట్టడాలు కనిపిస్తాయి. వ్యాపార సముదాయాల వద్ద కొనుగోళ్లకు వచ్చే ప్రజలు తమ వాహనాలను రోడ్లపైనే నిలిపివేస్తున్నారు. వాహనాల పార్కింగ్ దాదాపు సగం రోడ్డును ఆక్రమిస్తుండడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఉంటోంది.

పట్టణంలోని ప్రధాన కూడలిలో ఉన్న నాలుగు వరుసల రోడ్డు

పాదచారుల అవస్థలు

ఫుట్ పాత్ లేకపోవడంతో బస్సులు, జీపులు, లారీలు, ఆటోలు, ద్విచక్రవాహనాలు ఇలా పలు వాహనాలు తిరిగే రోడ్డుమీదే పాదచారులు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని రాకపోకలు సాగించాల్సిన దుస్థితి నెలకొంది. ఆర్టీసీ బస్టాండ్ నుంచి అంబేద్కర్ సర్కిల్, ఎన్టీఆర్ కూడలి వరకు ఈ పరిస్థితి మరింత దారుణంగా ఉంది. చాలా సందర్భంలో వాహనాలు ఢీకొని పలువురు గాయపడిన సందర్భాలున్నాయి. రోడ్డుపై పాదాచారులను, రోడ్డం మధ్యలో నిలిపిన వాహనాలను తప్పించబోయి వాహనదారులు కింద పడిన ఘటనలూ ఉన్నాయి. నడిచేందుకు ఫుట్‌పాత్ లేక దాదాపు రోడ్డు మధ్యన ఉన్న మార్జిన్‌ను ఆనుకున వాహనాలను నడపాల్సిన పరిస్థితి ఉంది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది.

బస్సు డ్రైవర్ల పరిస్థితి దయనీయం

పెనుకొండ పట్టణం మీదుగా రాకపోకలు సాగించే బస్సు డ్రైవర్ల పరిస్థితి మరీ దయనీయంగా ఉంటోంది. ఆర్టీసీ బస్టాండ్, దర్గా సర్కిల్, అంబేద్కర్ కూడలి, ఎన్టీఆర్ కూడలి, మడకశిర రోడ్డు తదితర ప్రాంతాలలో ప్రయాణికులు, కార్మికులు బస్సుల కోసం వేచి చూస్తుంటారు. తప్పనిసరిగా ఆ ప్రాంతాల్లో బస్సులను నిలపాల్సి ఉంది. పట్టణంలో మొత్తం నాలుగు వరుసల రోడ్డులో వాహనాలు వెళ్లేందుకు కేటాయించారు. అందులో రెండు వరుసలు ఒకపక్క ఉండగా మరోవైపు రెండు వరుసలు ఉన్నాయి. ఈ రోడ్డు వెడల్పు తక్కువగా ఉండడంతో బస్సు డివైడర్ పక్క రావాల్సిన పరిస్థితి ఉంది. అటు వైపు నుంచి ప్రయాణికులు వేచి ఉంటారు. ప్రయాణికులను ఎక్కించుకోవాలంటే బస్సును కుడివైపు నుంచి ఎడమ పక్కకు మళ్లించాలి. ఈ సమయంలోనే ఉన్న చిన్న రోడ్డులో ట్రాఫిక్‌ను చూసుకుంటూ బస్సును ఎడమవైపు తిప్పేందుకు డ్రైవర్లు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

ట్రాఫిక్ సమస్యను తీర్చాలి

పెనుకొండ పట్టణంలో ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్‌ను నియంత్రించే చర్యలు తీసుకోవాలి. పాదచారులు, వాహనదారులకు ఇబ్బంది లేకుండా ఫుట్‌పాత్‌పై ఎలాంటి దుకాణాలు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. మున్సిపాలిటీ, పోలీసు అధికారులు సమన్వయంతో ఈ సమస్యను పరిష్కరించాలి.

శ్రీనివాసులు,
రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్.

సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ జిల్లా నాయకులు

నేడు పుట్టపర్తిలో ఫ్యాప్టో ఆధ్వర్యంలో ధర్నా

జయప్రదం చేయండి :యుటిఎఫ్

ప్రజాశక్తి-మడకశిర టౌన్

పుట్టపర్తి పట్టణంలోని ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట శనివారం ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఫ్యాప్టో ఆధ్వర్యంలో చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని యుటిఎఫ్ పిలుపునిచ్చారు. పట్టణంలోని 4వ వార్డ్‌లో ఉన్న మండల ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం యుటిఎఫ్ మండల అధ్యక్షులు విఎన్.మాలింగప్ప, ప్రధాన కార్యదర్శి వై.జోగప్ప ఆధ్వర్యంలో ధర్నా విజయవంతంపై సన్నాహక సమావేశం నిర్వహించారు. యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు కె.భూతన్న, జిల్లా కార్యదర్శి డి.నరసింహప్ప మాట్లాడుతూ పిఆర్‌సి కమిటీని వెంటనే వేయాలని, డిఎలు, ఆర్థిక బకాయిలు విడుదల చేయాలని, బోధన, వృత్తిపరమైన సమస్యల పరిష్కారం కొరకు ధర్నా చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో యుటిఎఫ్ గుడిబండ మండల అధ్యక్షులు టి.మూడ్ల గిరియప్ప, నాయకులు పి.ఓబన్న, ఈ.నరసింహమూర్తి, బి.ఈశ్వరప్ప, వెంకటరమణ, సురేష్, ఎన్.రామంజప్ప పాల్గొన్నారు.

విద్యుత్ సర్దుబాటు ఛార్జీలు తగ్గించాలి

కరపత్రాలు పంపిణీ చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-పెనుకొండ

రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విద్యుత్ సర్దుబాటు ఛార్జీలను తగ్గించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలో కరపత్రాలు పంపిణీ చేసి ప్రజలకు స్మార్ట్ మీటర్లు, సర్దుబాటు ఛార్జీల భారాలపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు బిగించరాదు.. విద్యుత్ సర్దుబాటు ఛార్జీలు తగ్గించాలి అని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు హరి, బాబావలి, తిప్పన్న, హబీబ్, కాలనీవాసులు పవన్, బాషా, తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం

ప్రజాశక్తి-లేపాక్షి

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని అంగన్వాడీ ఉద్యోగులు అవగాహన కల్పించారు. మండలంలోని గలిబిపల్లి గ్రామ అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ముందుగా గ్రామ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం గర్భిణులు, బాలింతలు, పిల్లల తల్లులకు తల్లి పాల విశిష్టతపై అవగాహన కల్పించారు. పుట్టిన బిడ్డ నుంచి ఆరు నెలల వరకూ తల్లి పాలు మాత్రమే ఇవ్వాలన్నారు. ఆ తరువాత తల్లి పాలు, అదనపు పోషకాలు కలిగిన ఆహారం అందివ్వాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త రత్నమ్మ, ఆయా, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎలుగుబంటి దాడిలో గాయపడిన డీలర్‌కు పరామర్శ

ప్రజాశక్తి-గుడిబండ

మండలంలోని ఎస్.రాయవరం గ్రామానికి చెందిన డీలర్ భూతరాజు ఇటీవల ఎలుగుబంటి దాడిలో తీవ్రంగా గాయపడ్డాడు. ఆయన ఆసుపత్రిలో చికిత్స పొంది ప్రస్తుతం ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి అతని ఇంటికి వెళ్లి పరామర్శించారు. రాయవరంలో వైసిపి ప్రభుత్వంలో వాలంటీర్‌గా పని చేసిన వ్యక్తి టిడిపిలో చేరగా శ్రీనివాసమూర్తి పసుపుకండువా వేశారు. అనంతరం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో నాగేంద్రప్ప, రంగధామప్ప, వీరన్న, నటరాజ్, కార్యకర్తలు పాల్గొన్నారు.అలాగే మండలంలోని ముత్తుకూరు, మద్దనకుంట, ఎస్ఎస్ గుండ్లు గ్రామాల్లో చేపట్టిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌మూర్తి పాల్గొన్నారు. అనంతరం గుండెపోటుతో మృతిచెందిన ముత్తుకూరు గ్రామానికి చెందిన టిడిపి నాయకులు దాసేగౌడ్ కుటుంబాన్ని ఆయన పరామర్శించారు.

బాలికల వసతి గృహం తనిఖీ

బాలికల వసతి గృహంలో భోజనం నాణ్యతను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి సుదర్శన్

ప్రజాశక్తి-లేపాక్షి

మండలంలోని బాలికల వసతి గృహాన్ని శుక్రవారం మండల ప్రత్యేకాధికారి సుదర్శన్ సందర్శించి హాస్టల్ పరిసరాలు, రికార్డులను పరిశీలించారు. కాసేపు విద్యార్థినులతో ముచ్చటించారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెడుతున్నారా, హాస్టల్‌లో సరైన సౌకర్యాలు ఉన్నాయా అని ఆరా తీశారు. ఆ తర్వాత సిబ్బందితో సమావేశం నిర్వహించి విద్యార్థినులకు నాణ్యమైన భోజనాలు పెట్టాలని, గదులను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ఆయన వెంట వార్డెన్ సరస్వతి, సిబ్బంది ఉన్నారు.

ఫిట్‌నెస్ లేని పాఠశాల బస్సులపై ఫిర్యాదు

ప్రజాశక్తి-మడకశిర

నిబంధనలకు విరుద్ధంగా బస్సులు నడుపుతున్న ప్రయివేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకో వాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సిఐ నగేష్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఈరేష్ మాట్లాడుతూ నియోజక వర్గ వ్యాప్తంగా పలు ప్రయివేటు విద్యాసంస్థల యాజమాన్యాలు లాభార్జనే తప్ప విద్యార్థుల క్షేమం గురించి ఆలోచించడం లేదన్నారు. ఫిట్‌నెస్, కండిషన్‌లో లేని బస్సులు నడుపుతూ, బస్సుల్లో పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తూ వారి ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కావున ఇటువంటి బస్సులను వెంటనే తనిఖీ చేసి ఫిట్‌నెస్, కండిషన్ లేని బస్సులను సీజ్ చేయాలని కోరారు. అలాగే పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే పట్టణంలోని బాలికల హాస్టళ్లలో ఒక్క దానిలో కూడా సీసీ కెమెరాలు లేవని, సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి బాలికలకు భద్రత పెంచాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ నాయకులు ముత్తహీర్, సాయి, దేవ, అశోక్, తదితరులు పాల్గొన్నారు.



నూతన ఎంఇఒ రాఘవయ్యను సన్మానిస్తున్న యుటిఎఫ్ నాయకులు

నూతన ఎంఇఒకు యుటిఎఫ్ నాయకుల సన్మానం

ప్రజాశక్తి-పెనుకొండ

మండల నూతన ఎంఇఒగా శుక్రవారం రాఘవయ్య బాధ్యతలు స్వీకరించారు. దీంతో మండల యుటిఎఫ్ నాయకులు ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. కేక్ కట్ చేసి అభినం దనలు తెలిపారు. ఇంతకు ముందు ఇక్కడ పని చేసిన ఎంఇఒ చంద్రశేఖర్ గురువారం ఉద్యోగ విరమణ పొందారు. ఆ స్థానంలో రాఘవయ్య బదిలీపై ఇక్కడికి వచ్చారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, జిల్లా కార్యదర్శి నారాయణస్వామి, సీనియర్ నాయకులు నబి, జిల్లా మహిళా కమిటీ కన్వీనర్ హసీనాబేగం, మండల అధ్యక్షుడు ఉపేంద్రమూర్తి, ప్రధాన కార్యదర్శి రవీంద్రనాథ్, నరసింహులు, రాజగోపాల్, రాజశేఖర్, రామాంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ'

ప్రజాశక్తి-గుడిబండ

మండలంలోని తాళికెర గ్రామంలో శుక్రవారం వైసిపి మండల కన్వీనర్ డిఎల్.యంజేరేగౌడ్ ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. నాయకులు ఇంటింటికీ వెళ్లి సిఎం చంద్రబాబు, కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్‌తో పాటు ఎన్నికల హామీలను అమలు చేయ కుండా మోసం చేస్తుందని ప్రజలకు వివరించారు. ఎన్నికల హామీల అమలుపై కూటమి నాయకులను ఎక్కడికక్కడ నిలదీయాలని ప్రజలకు సూచించారు. అలాగే వైసిపి హయంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచి రంగస్వామి, నాయకులు ఈరన్న, చంద్రశేఖర్, గోవిందప్ప, నాగరాజు, శివన్న, తదితరులు పాల్గొన్నారు.

'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ'లో పాల్గొన్న వైసిపి నాయకులు

రైతు బిడ్డలకు పోలీసు ఉద్యోగం

మారుతీప్రసాద్

ప్రజాశక్తి-పెనుకొండ

రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం వెలువడిన పోలీస్ కానిస్టేబుల్ ఫలితాల్లో జిల్లాకు చెందిన పలువురు రైతుబిడ్డలు, నిరుపేద కుటుంబాలకు చెందిన యువకులు ప్రతిభ చాటి ఉద్యోగాలు సాధించారు. మండలంలోని కురుబవాండ్లపల్లి గ్రామానికి చెందిన లక్ష్మీదేవి, రామాంజనేయులు దంపతుల రెండో కుమారుడైన కమ్మిటి మారుతి ప్రసాద్ కానిస్టేబుల్(సివిల్)గా ఎంపికయ్యాడు. పోటీ పరీక్షలో 138 మార్కులతో 73వ ర్యాంకు సాధించాడు. తమ కుమారుడు పోటీ పరీక్షలో ఉద్యోగం సాధించడంతో తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. వీరి పెద్ద కుమారుడు కృష్ణమూర్తి ఇప్పటికే ఎస్ఐ ఉద్యోగం సాధించి అనంతపురం పిటిసిలో విధులు నిర్వర్తిస్తున్నారు. అన్న ప్రోత్సాహంతోనే ఇది సాధ్యమైందని, ఈ ఫలితం తనలో ఆత్మ స్థైర్యం నింపిందని మారుతిప్రసాద్ తెలిపారు.

ట్యూషన్ చెబుతూ కానిస్టేబుల్‌గా ఎంపిక

పెనుకొండ పట్టణానికి చెందిన శాంతమ్మ, సిద్ధరాజు దంపతుల కుమారుడు బోయ మోహన్ కుమార్ కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. పోటీ పరీక్షల్లో 154 మార్కులు సాధించి జిల్లా స్థాయిలో 5వ స్థానంలో నిలిచాడు. తండ్రి సిద్ధరాజు కియా పరిశ్రమలో కాంట్రాక్ట్ కార్మికునిగా విధులు నిర్వహిస్తున్నాడు. మోహన్‌కుమార్ తల్లిదండ్రులకు చేదోడుగా ట్యూషన్లు చెబుతూ కానిస్టేబుల్ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యాడు.

తల్లిదండ్రులతో బోయ మోహన్‌కుమార్

పవన్‌కుమార్

లేపాక్షి : మండలంలోని కంచి సముద్రం పంచాయతీ పరిధిలోని బసవన్నపల్లి గ్రామానికి చెందిన నాగరాజు, సరోజమ్మ దంపతుల కుమా రుడు పవన్‌కుమార్ కాని స్టేబుల్ ఉద్యోగం సాధిం చాడు. జిల్లాలో 58 ర్యాం క్ సాధించడాడు. పవన్ గ్రామంలోనే మొదటగా ప్రభుత్వం ఉద్యోగం సాధించడంతో తల్లిదండ్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. పవన్ తల్లిదండ్రులు వ్యవసాయం చేసుకొంటూ కుటుంబాన్ని పోషించుకునేవారు.

రొద్దం : మండలంలోని కందుకూర్లపల్లి గ్రామానికి చెందిన రాచెర్లప్ప కుమారుడు విజయ్ కుమార్ పోలీసు కొలువు సాధించాడు. అతడు జిల్లా స్థాయిలో 60వ ర్యాంకు సాధించాడు. విజయ్ కుమార్ 1-5వ తరగతి వరకూ స్వగ్రామంలో, 6 నుంచి ఇంటర్ వరకూ రొద్దం ప్రభుత్వ పాఠశాల, జూనియర్ కళాశాలలో, డిగ్రీ పెనుకొండలోని పరిటాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదివాడు. విజయ్‌కుమార్ తల్లిదండ్రులు వ్యవసాయంతో పాటు కూలి పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషించుకునేవారు. వారికి విజయ్‌తో పాటు ఇద్దరు కుమార్తెలు సంతానం. తల్లిదడ్రుల కష్టం తెలిసిన విజయ్‌కుమార్ కష్టపడి చదివి పోలీసు ఉద్యోగం సాధించాడు.

తల్లిదండ్రులతో విజయ్‌కుమార్

జిల్లా టాపర్ రాఘవేంద్రరెడ్డి

రాఘవేంద్రరెడ్డి

చిలమత్తూరు : ఆంధ్రప్రదేశ్ పోలీస్ కానిస్టేబుల్ పరీక్షలో మండలంలోని లాలేపల్లి గ్రామానికి చెందిన రాఘవేంద్ర రెడ్డి సత్తా చాటాడు. వ్యవసాయ కుటుంబానికి చెందిన జి. రాఘవేంద్ర రెడ్డి 159 మార్కులు సాధించి ఉమ్మడి అనంతపురం జిల్లా టాపర్‌గా నిలిచాడు. జయచంద్ర రెడ్డి, రాధమ్మ దంపతుల కుమారుడైన రాఘవేంద్ర రెడ్డి చిన్ననాటి నుంచి పోలీస్ ఉద్యోగం పట్ల ఆసక్తి చూపిస్తూ తన లక్ష్యాన్ని ముందే నిర్ధారించుకున్నాడు. ఇప్పటికే 2022లో స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ ద్వారా జీడీ పోస్టుకు ఎంపికైన రాఘవేంద్ర 2023లో తెలంగాణ పోలీస్ కానిస్టేబుల్ రిక్రూట్మెంట్‌లోనూ ఉత్తీర్ణత సాధించాడు. అయితే కావాలన్నది తన కల అని భావించిన ఆ యువకుడు ఆ ఉద్యోగాల్లో చేరలేదు. ఇప్పుడు ఏపీ కానిస్టేబుల్ ఉద్యోగంలో చేరి తరువాత ఎస్ఐ స్థాయికి ఎదగాలనే సంకల్పంతో ఉన్నాడు. ఈసందర్భంగా రాఘవేంద్ర రెడ్డిని తోటిమిత్రులు, గ్రామస్తులు అభినందించారు.

గుడిబండ ఎంఇఒ-1గా ప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-గుడిబండ

మండల ఎంఇఒ-1గా ప్రసాద్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయనకు మండలంలోని పలువురు ఉపాధ్యాయులు, ఎమ్మార్సీ సిబ్బంది, సిఆర్పి, పిటిఐలు శుభాకాంక్షలు తెలిపారు. నూతన ఎంఇఒ మాట్లాడుతూ ఎల్లప్పుడూ ఉపాధ్యాయులకు అందుబాటులో ఉంటానని, నా పరిధిలో ఉన్న పాఠశాలలను ఎప్పటికప్పుడు తనిఖీ చేసి విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. అలాగే పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి-మడకశిర

సాధారణ బదిలీల్లో భాగంగా రొళ్ల మండలంలోని బిజి.హళ్లి జడ్పీ హైస్కూల్ నుంచి బదిలీపై వివిధ పాఠశాలలకు వెళ్లిన హెచ్‌ఎం యంజారప్ప, ఉపాధ్యాయులు రాజ్యలక్ష్మి, నాగనందం, వాణి, శకుంతలమ్మలను శుక్రవారం పాఠశాలలో హెచ్‌ఎం వసంతప్ప ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. వీరు పాఠశాల, విద్యార్థుల విద్యాభివృద్ధికి చేసిన సేవలను కొనియాడారు. అలాగే పాఠశాలలో పని చేసే మధ్యాహ్న భోజనం ఏజెన్సీ నిర్వాహకులను, ఆయాను, రాత్రి కాపలా దారులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రూబీయానాజ్, వేణుగౌడ్, ఎస్ఎంసి సభ్యులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

మడకశిర రూరల్ : మండలంలోని జిల్లేడుగుంట పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన ఉపాధ్యా యులు కె.భూతన్న, సుధారాణి, లలితలను హెచ్‌ఎం షెక్షావలి, పిఎస్ హెచ్‌ఎం రవికుమార్, ఎస్ఎంసి ఛైర్మన్ లక్ష్మీదేవి గుండప్ప ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఎస్ఎంసి సభ్యులు, గ్రామ పెద్దలు ఘనంగా సన్మానించారు. వారిని పూలమాలలు, శాలువాలతో సత్కరించి వారి సేవలను కొనియాడారు. అలాగే కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులకు సాదర స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సునీత, కరియన్న, ప్రభాకర్, ఇందిరమ్మ, మోహన్, లక్ష్మణమూర్తి, ఫరీద, గ్రామస్తులు హనుమంత గౌడ, నరసేగౌడ్, గుండప్ప, విశ్వనాథ్, మంజునాథ్, హనుమంతు, నాగరాజు, రంగప్ప, ఎస్ఎంసి వైస్ ఛైర్మన్, ఎస్ఎంసి మాజీ ఛైర్మన్ నాగరాజు, సభ్యులు పాల్గొన్నారు.

జిల్లేడుగుంట పాఠశాలలో బదిలీ, కొత్త ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఉపాధ్యాయ బృందం

కొత్తచెరువు ఎంఇఒగా సోమశేఖర్ నాయుడు

ప్రజాశక్తి - కొత్తచెరువు

కొత్తచెరువు ఎంఇఒగా సోమశేఖర్ నాయుడు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇంతవరకు గోరంట్ల ఎంఈఓ 1 జాన్ రెడ్డప్ప ఇన్‌ఛార్జి ఎంఇఒగా బాధ్యతలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో సోమశేఖర్‌నాయుడును ప్రభుత్వం కొత్తచెరువు ఎంఇఒగా నియమించింది. దీంతో ఆయన శుక్రవారం బాధ్యతలు చేపట్టారు.

కోర్టు స్టేతో ఆగిన ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి - కొత్తచెరువు

కోర్టు స్టేతో కొత్తచెరువులో ఐదు రోజులుగా జరుగుతున్న అ క్రమ నిర్మాణాల తొలగింపు పక్రియ ఆగిపోయింది. మూడు రోడ్లకు ఇరువైపులా ఉన్న కొందరు వ్యక్తులు మార్కింగ్లు వేసిన అక్రమ నిర్మాణాలు తొలగించకుండా కోర్టు నుండి స్టే తీసుకురావడంతో తాత్కాలికంగా వాటిని తొలగించడం నిలిపివేశారు. ఈ కోర్టు స్టే తీసుకొచ్చిన వారిని ఆర్డీవో సువర్ణ ఇటీవలే తహశీల్దార్ కార్యాలయం వద్దకు పిలిపించి స్టే తాత్కాలికమైనదని వీటిని తొలగించుకోవాలని ఆదేశించారు.

ఉమ్మడి భూములను రక్షించండి

ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు

ఉమ్మడి భూములను రక్షించాలని ఇనుగులూరు పంచాయతీ సర్పంచి బాబా ఫక్రుద్దీన్ కోరారు. ఈ మేరకు ఆయన శుక్రవారం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఇన్‌ఛార్జి తహశీల్దార్ శ్రీనివాస్ రెడ్డికి అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిధిలోని ఇనుగులూరు, వెంకటాపురం ,టీకుంట్లపల్లి, గొల్లపల్లి, రామిరెడ్డి గారి పల్లి, గాజుకుంట్లపల్లి, నల్ల గుట్లపల్లి, తదితర పంచాయతీ పరిధిలో ఉన్న కొండగుట్ల ఉమ్మడి భూములు అక్రమణాలకు గురి కాకుండా సంరక్షించుటకు అభివృద్ధి చేసుకునేందుకు సరిహద్దులు వేసి ఇవ్వాలని ఆయన కోరారు.

క్యాన్సర్‌పై అవగాహన అవసరం

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

క్యాన్సర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలనిరిషి విద్యాలయ పాఠశాల ప్రిన్సిపల్ కరణ్ స్వరూప సింగ్ తెలిపారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచ ఊపిరితిత్తుల క్యాన్సర్ దినోత్సవ సందర్భంగా పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ధూమపానం ప్రమాదకరమని, వాహనాల నుండి వెలువడే విషపూరిత రసాయన పొగలు పీల్చడం వలన శ్వాస సమస్యలు వస్తాయని తెలిపారు. బయటికి వెళ్లినప్పుడు తప్పనిసరిగా మాస్క్ గాని చేతి గుడ్డ గాని ధరించాలని తెలిపారు. అదేవిధంగా సిగరెట్లు, బీడీలు తాగేవారికి దూరంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డీన్ భాస్కర్ రెడ్డి, సీఈవో రవీంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

పట్టణంలోని యాదవ వీధిలోని శ్రీ సాయి డిగ్రీ కళాశాలలో యువర్స్ ఫౌండేషన్, చౌడేశ్వరి ట్రస్ట్, శ్రీ సాయి డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ రక్తదాన శిబిరాల వల్ల ఎంతోమందికి అవసరమైనప్పుడు రక్తాన్ని దానం చేసే అవకాశం ఏర్పడుతుందన్నారు. ఈ శిబిరంలో 30 మంది రక్తదానం చేశారు. వారికి సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యక్షులు పోలా ప్రభాకర్, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన

ప్రజాశక్తి - కొత్తచెరువు రూరల్

కొత్తచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బీసీ కాలనీలో క్షయ వ్యాధి పై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. డిటిసి సూపర్వైజర్ అబిద్ భాషా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. క్షయ వ్యాధి పట్ల ప్రతిఒక్కరు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. వ్యక్తి గత, పరిసరాల పరిశుభ్రత పాటించి ప్రజలు ఆరోగ్య వంతమైన జీవనం సాగించాలని కోరారు. ఈ కార్యక్రమములో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది లీలావతి, ఎంపిహెచ్ఎ కిష్టప్ప ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల్లో గొట్లూరు విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ఆర్టీడీ ఆధ్వర్యంలో స్థానిక ఆడిటింగ్ స్టేడియంలో జూలై 15వ తేదీ నుండి 25వ తేదీ వరకు నిర్వహించిన కబడ్డీ పోటీల్లో గొట్లూరు విద్యార్థులు ప్రతిభ కనపర్చారు. టోర్నమెంటు ఫైనల్స్‌లో కొత్తపేట మున్సిపల్ హై స్కూల్, జడ్పీహెచ్ఎస్ గొట్లూరు మధ్య జరిగిన పోటీలలో గొట్లూరు జట్టు రన్నరప్ స్థానంలో నిలిచిందని హెడ్మాస్టర్ జగన్నాథం తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులను హెడ్మాస్టర్ తో పాటు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ రమేష్ బాబు, పాఠశాల ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ సభ్యులు, తోటి విద్యార్థులు అభినందించారు.

మొక్కలను సంరక్షించాలి

పుట్టపర్తి రూరల్ : తమ బిడ్డలను ఎంత జాగ్రత్తగా చూసుకుంటామో మొక్కలను కూడా అంతే జాగ్రత్తగా సంరక్షించుకోవాలని ఐసీడీఎస్ పీడీ ప్రమీల అన్నారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా కొత్తచెరువు మండలం మామిళ్ళకుంట క్రాస్ లో శుక్రవారం నిర్వహించిన ప్లాంటేషన్ కార్యక్రమానికి పీడీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాతావరణ కాలుష్యం పెరిగిపోతోందని, దీని వల్ల అనేక రకాల ప్రాణాంతక వ్యాధులు ప్రబలిపోతున్నాయని తెలిపారు. ఈ పరిణామాలు మానవాళి పాలిట ప్రాణాంతకంగా మారాయని ఆందోళన వ్యక్తం చేసారు. ఇటువంటి క్లిష్టపరిస్థితుల నుంచి బయట పడాలంటే ప్రతి ఒక్కరూ ఒక మొక్క చొప్పున నాటి సంరక్షించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ అధికారులు జయంతి, కొండసాని రజిత, అంగన్వాడీ వర్కర్లు, తల్లులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని మంత్రి సత్య కుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం పట్టణంలోని గాంధీనగర్, కాలేజ్ సర్కిల్ ప్రాంతాల్లో పర్యావరణ అనురక్త కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గాంధీనగర్‌లో ఏర్పాటుచేసిన పార్కులో మొక్కల నాటే కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పర్యావరణ పరిరక్షణ గురించి వివరించారు. కాలేజ్ సర్కిల్ వద్ద నిర్మించిన మన ధర్మవరం గార్డెన్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి ధర్మవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మొక్క నాటుతున్న మంత్రి , తదితరులు

బాబా శతజయంతి వేడుకలకు ప్రధాని నరేంద్రమోడీకి ఆహ్వానం

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

ఈ ఏడాది నవంబర్లో జరిగే సత్యసాయి శతజయంతి ఉత్సవాలలో పాల్గొనాలని సత్యసాయి ట్రస్టు సభ్యులు ప్రధానమంత్రి నరేంద్ర మోడీని ఆహ్వానించారు. శుక్రవారం ఢిల్లీలో ప్రధానిని సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్ జె రత్నాకర్ ట్రస్ట్ సభ్యులు జస్టిస్ రామ సుబ్రహ్మణ్యన్, ర్యూకో హీరా, ఎస్ ఎస్ నాగానంద్, అఖిల భారత సత్యసాయి సేవా అధ్యక్షుడు నిమిష్ పాండే తదితరులు కేంద్రం మంత్రి కిషన్ రెడ్డితో కలిసి ప్రధానికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ట్రస్టు సభ్యులు మాట్లాడుతూ శతజయంతి ఉత్సవాలను వైభవంగా నిర్వహించాలని అనుకుంటున్నామని ప్రధానికి తెలిపినట్లు వివరించారు. ఈసందర్భంగా గతంలో బాబా తో ప్రధాని దిగిన ఫోటోలు అందజేశామన్నారు.

ప్రధానికి జ్ఞాపికను అందజేస్తున్న ట్రస్టీ రత్నాకర్

జగన్ పర్యటన విజయవంతంతో

మంత్రి అనితకు మతి భ్రమించింది : వైసిపి

ప్రజాశక్తి-హిందూపురం

వైసిపి అధినేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేపట్టిన నెల్లూరు పర్యటన విజయవంతం కావడంతో రాష్ట్రహోం శాఖ మంత్రి అనిత మతిభ్రమించి మాట్లాడుతున్నారని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త దీపికా వేణు రెడ్డి ఆరోపించారు. శుక్రవారం వైసీపీ కార్యాలయంలో ఆమె ఈ విషయంపై విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. జగన్ మోహన్ రెడ్డి నెల్లూరు పర్యటన విజయవంతం కావడంపై రాష్ట్ర హోం శాఖ మంత్రి అనిత చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆమె చేసిన వ్యాఖ్యలు నిరూపించాలని సవాల్ విసిరారు. జగన్ మోహన్ రెడ్డి నెల్లూరు పర్యటనకు వస్తున్నారని తెలిసి, కూటమి ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడి జగన్ పర్యటనకు జనాలు రాకుండా మూడు వేల మంది పోలీసులను పెట్టారన్నారు. ఇది చాలా దన్నట్లు రోడ్లమీద గుంతలు తవ్వి, ఇనుప కంచెలు పెట్టారని ఆరోపించారు. అయినా జనాలు సునామీలా వచ్చారన్నారు. ఇంత పెద్ద ఎత్తున జనాలు రావడంతో మంత్రి అనితకు మతిభ్రమించిందని ఎద్దేవా చేశారు. సభకు జనం వచ్చినట్లు నిరూపిస్తే తన మంత్రి పదవికి రాజీనామా చేస్తారా అని దీపికా వేణు రెడ్డి సవాల్ విసిరారు. రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అరాచకాలకు అడ్డుకట్ట వేయలేని అసమర్థ హోంమంత్రి నిత్యం మాజీ సీఎం వైఎస్ జగన్‌ను దూషించడానికి పరిమితమయ్యారని విమర్శించారు. ఇప్పటికైనా అసత్య ఆరోపణలు చేయడం మానుకొని రాష్ట్రంలో శాంతి భద్రతలను కాపాడాలన్నారు.

బంగారు కుటుంబాలకు బాసటగా నిలవండి

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పురపాలక సంఘంలో గుర్తించిన బంగారు కుటుంబాలకు ఉపాధ్యాయులు బాసటగా నిలిచి వారికి మార్గ నిర్దేశం చేయాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున ప్రధానోపాధ్యాయులకు సూచించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం తన ఛాంబర్ లో పురపాలక సంఘ వ్యాప్తంగా ఉన్న ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులతో బంగారు కుటుంబాల దత్తత విషయంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ హిందూపురం పురపాలక సంఘం పరిధిలో 3245 బంగారు కుటుంబాలను గుర్తించడం జరిగింది. ఈ కుటుంబాలలో 10248 మంది కుటుంబ సభ్యులు ఉన్నారు. ఈ బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవడానికి ఇప్పటికే 161 మంది మార్గదర్శకులు ముందుకు వచ్చి 243 కుటుంబాలను దత్తత తీసుకున్నారన్నారు. ఉపాధ్యాయులు ముందుకు వచ్చి వారి పాఠశాలల్లో చదివే విద్యార్థుల కుటుంబాలను దత్తత తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మున్సిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

బెంగళూరు తరహాలో అధునాతన వెంచర్

లేక్ బ్రీజ్ లేఅవుట్ అధినేత గోవిందరాజులు

వెంచర్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వెంచర్ అధినేత గోవిందరాజు, సరళ రాజు

ప్రజాశక్తి-హిందూపురం

బెంగళూరు మహానగరంలో వేస్తున్న వెంచర్ తరహాలో హిందూపురంలో వెంచర్ ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించామని లేక్ బ్రీజ్ లేఅవుట్ అధినేత గోవిందరాజులు పేర్కొన్నారు. పట్టణ సమీపంలోని పులమతి రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన లేక్ బ్రీజ్ లే అవుట్‌ను ఆదివారం ప్రారంభిస్తున్నారు. ఈ నేపథ్యంలో లేఅవుట్ అధినేత వెంచర్‌లోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశాన్నిశుక్రవారం ఏర్పాటు చేసి వెంచర్ కు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా గోవిందరాజులు, ఆయన సతీమణి సరళ రాజు మాట్లాడుతూ హిందూపురం పట్టణంలో పులమతి రోడ్డులో అన్ని సౌకర్యాలతో సుమారు 25 ఎకరాలలో అహూడా అనుమతులతో వెంచర్ ఏర్పాటు చేశామన్నారు. తమకు 30 సంవత్సరాల నుంచి వెంచర్ల ఏర్పాటులో అనుభవం ఉందని, బెంగళూరు పరిసర ప్రాంతాలలో ఎన్నో వెంచర్లను వేసి ప్రజలకు అనుకూలంగా ప్లాట్లను విక్రయించామన్నామని తెలిపారు. బెంగళూరు తరహాలో హిందూపురంలో వెంచర్ ఏర్పాటు చేశామన్నారు. చిన్న చిన్న ఉద్యోగులు, మధ్య తరగతి వారు వారి సొంతింటి కల నెరవేర్చుకోవడం కోసం వారికి తగిన విధంగా ధరలను ఏర్పాటు చేశామన్నారు. అప్పటికి వారికి ఆర్థిక ఇబ్బందులు ఎదురైతే బ్యాంకు రుణాలు సైతం అందించే విధంగా చర్యలను తీసుకున్నామన్నారు. ఈ అవకాశాన్ని హిందూపురం పట్టణ ప్రజలతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 97414 90639, 89519 19309, 97315 63119 నెంబర్లకు సంప్రదించాలని కోరారు. ఆదివారం నిర్వహించే వెంచర్ ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కమిషనర్‌కు ఉద్యోగుల అభినందనలు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం మున్సిపల్ కమిషనర్ గా విధులు నిర్వహిస్తున్న మల్లికార్జునకు ప్రభుత్వం స్పెషల్ గ్రేడ్ కమిషనర్ గా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా మున్సిపల్ ఉద్యోగులు శుక్రవారం కమిషనర్ చాంబర్ లో కమిషనర్‌ను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దస్తగిరి, అసిస్టెంట్ ఇంజనీర్ జనార్ధన్, అకౌంటెంట్ మనోహర్, శోభన్ రెడ్డి, రెవెన్యూ ఇన్స్ పెక్టర్ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌ను అభినందిస్తున్న మున్సిపల్ ఉద్యోగులు

డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి రూరల్ మండలం చిప్పలమడుగు చెందిన మారక రాజ్యలక్ష్మికి శ్రీకృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయం ఆర్థిక శాస్త్ర విభాగంలో డాక్టరేట్ ప్రధానం చేశారు. ఈ మేరకు ప్రొఫెసర్ జి వెంకట్ నాయుడు ఆధ్వర్యంలో అనంతపురం జిల్లాలోని వేరుశెనగ రైతులు ఆత్మహత్యల పై ప్రత్యేక సూచన అనే అంశం పైన పరిశోధన చేసినందుకు గాను రాజ్యలక్ష్మికి డాక్టరేట్ దక్కింది. ఈమె పలు జాతీయ, అంతర్జాతీయ సదస్సులో పాల్గొని పలు పరిశోధన పత్రాలు సమర్పించారు. డాక్టరేట్ పొందిన రాజ్యలక్ష్మిని పలువురు అభినందించారు.

రాజ్యలక్ష్మి

రాష్ట్రాభివృద్ధి కూటమితోనే సాధ్యం : టిడిపి

పింఛను పంపిణీ చేస్తున్న మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి

తనకల్లులో పింఛన్ల పంపిణీలో టిడిపి నాయకులు, తదితరులు

ప్రజాశక్తి - నల్లచెరువు

రాష్ట్ర అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన చేసిన సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు కన్వీనర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో అధికారులు స్వాగతం పలికారు. లబ్ధిదారులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా ఎన్టీఆర్ భరోసా పింఛన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు సూపర్ సిక్స్ పథకాలను అమలులోకి తెచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానిదని అన్నాను. రాష్ట్రాభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్ష నాయకుడు అనవసర రాద్ధాంతం చేస్తూ లేనిపోని వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. వైయస్ జగన్మోహన్ రెడ్డికి మతిభ్రమించిందనాన్రు. ఇప్పటికైనా రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ కు ఎమ్మెల్యే కందికుంట హితవు పలికారు. పింఛన్ల పంపిణీ అనంతరం మండల కేంద్రంలో నిర్మాణ దశలో ఉన్న శ్రీ సీతారాముల ఆలయాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి సూర్యనారాయణ.తహశీల్దార్ జమానుల్లాఖాన్.ఎంపీడీవో రఘునాథ్ గుప్తా.ఏవో రాజశేఖర్. మాజీ ఎంపీపీలు శివారెడ్డి.మాబు సాబ్. మాజీ జెడ్పిటిసిలు అబ్దుల్ ఖాదర్. నాగభూషణ్ నాయుడు, మాజీ జెడ్పిటిసి అబ్దుల్ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి క్రైమ్ : పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం అనిమాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసినకొత్తగా మంజూరు అయినా వితంతు పింఛన్లు పంపిణీలో పల్లె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో నూతనంగా 678 వితంతు పింఛన్లు మంజూరు అయ్యాయన్నారు. దేశంలోనే అత్యధికంగా పింఛన్లు పంపిణీ చేస్తున్నది ఒక్క ఆంధ్రప్రదేశ్ మాత్రమే అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ క్రాంతికుమార్, టిడిపి పట్టణ కన్వీనర్ రామాంజనేయులు కౌన్సిలర్ వెంకటరమణమ్మ, మాజీ మున్సిపల్ చైర్మన్ బెస్త చలపతి, పార్టీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, నాయకులు ప్రభాకర్, ఆవుల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

తనకల్లు : మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన గ్రామసభలో నూతనంగా మంజూరైన వితంతు పెన్షన్లను మండల అభివృద్ధి అధికారి రామా నాయక్, చేతుల మీదుగా పంపిణీ చేశారు. టిడిపి నాయకులు, లబ్ధి పొందిన వితంతు మహిళలు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండలకన్వీనర్ రెడ్డి శేఖర్ రెడ్డి, యూనిట్ ఇన్చార్జులు తిరుపతి దామోదర్ మహబూబ్ బాషా,బూత్ కమిటీ కన్వీనర్లు చాకివేల శిరీష, తోట సరోజమ్మ, నాయకులు నాగేంద్ర ప్రసాద్, శ్రీధర్ రెడ్డి, రమణ, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం వృద్ధులకు వికలాంగులకు ఆర్థిక భద్రత కల్పిస్తోందని మున్సిపల్ ఛైర్పర్సన్ దిల్షాద్ ఉన్నిషా బహువుద్దీన్ పేర్కొన్నారు.కదిరి మున్సిపాలిటీకి చెందిన 10 వ వార్డులోనీ సయ్యద్ వీధి, కుమ్మర వీధి, గాంధీ నగర్ ఏరియాలలో పెన్షన్ తీసుకుంటూ చనిపోయిన వారి భార్యలకు మంజూరైన పింఛన్లను శుక్రవారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఛైర్పర్సన్ వితంతువులకు, వికలాంగులకు, వృద్ధులకు కూటమి ప్రభుత్వం అండగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు నాయకులు రహమతుల్లా, గౌస్ పీర్, వలి, రషీద్, జుబేదా, చంద్ర, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : అర్హత కలిగిన వారందరికీ ప్రభుత్వ పథకాలు అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎన్టీఆర్ భరోసా పథకం కింద వితంతు స్పౌస్ కేటగిరీ పింఛన్లు లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హిందూపురం మున్సిపాలిటీకి ఎన్టీఆర్ భరోసా పథకం కింద స్పౌస్ వితంతు పింఛన్లు 221 విడుదలైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు గిరీష్ కుమార్, అంజలి రెడ్డి, రహమత్ బీ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ప్రెస్ వెంకటేష్, తిమ్మయ్య, కదిరప్ప, మంగేష్, వెంకటేష్, అంజి, గంగాధర్, లింగేష్, మహేష్, లోకేష్, మజీద్ ఖాన్, నాగేష్, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

అంతర్ రాష్ట్ర చైన్ స్నాచర్ అరెస్టు

ప్రజాశక్తి-హిందూపురం

రైళ్లలో ప్రయాణిస్తున్న మహిళల మెడ నుండి బంగారు గొలుసులను లాక్కెళ్లే ఒరిస్సా రాష్ట్రానికి చెందిన దొంగను రైల్వే పోలీసులు అరెస్టు చేసి అతని నుండి 75 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి రైల్వే పోలీస్ అధికారులు వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఒరిస్సా రాష్ట్రం కందమల్ జిల్లాకు చెందిన బినోత్ నాయక్ రైళ్లలో ప్రయాణించే మహిళల మెడలో నుండి బంగారు గొలుసులను లాక్కెళ్లేవాడు. దీనిపై రైల్వే పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలు దర్యాప్తు చేపట్టారు. ఈ నేపథ్యంలో శుక్రవారం హిందూపురం రైల్వే స్టేషన్ లో అనుమానాస్పదంగా తిరుగుతున్న బినోత్ నాయక్ అదుపులోకి తీసుకొని విచారించగా నేరాలు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. గుంతకల్లు రైల్వే ఎస్పి రాహుల్ మీనా నేతత్వంలో రైల్వే డిఎస్పి హర్షిత పర్యవేక్షణలో ధర్మవరం జిఆర్పిఎఫ్ సిఐ అశోక్ కుమార్, ధర్మవరం, హిందూపురం జి ఆర్ పి ఎఫ్ ఎస్ ఐ లు రోహిత్ గౌడ్, సాయినాథ్ రెడ్డి, రైల్వే ఎస్సై సజ్జప్పల ఆధ్వర్యంలో హెడ్ కానిస్టేబుళ్ల లో రాజశేఖర్ రెడ్డి, శ్రీనివాసులు, కానిస్టేబుళ్లు రమేష్, జగదీష్ చైన్ స్నాచింగ్ దొంగను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించారన్నారు. స్వాధీనం చేసుకున్న ఆభరణాలకు సంబంధించి హిందూపురంలో మూడు, ధర్మవరంలో రెండు, కదిరి రైల్వే స్టేషన్ పరిధిలో ఒక కేసు నమోదైనట్లు వివరించారు. అంతర్‌రాష్ట్ర దొంగను పట్టుకోవడంలో కృషి చేసిన పోలీసు బృందాన్ని గుంతకల్లు ఎస్పీ రాహుల్ మీనా అభినందించారు.

చోరీలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - కదిరి టౌన్

దొంగతనాలు జరగకుండా సెక్యూరిటీని నియమించుకుని అప్రమత్తంగా ఉండాలని పట్టణ సీఐ నారాయణరెడ్డి బ్యాంకులు, ఫైనాన్స్ కంపెనీ సిబ్బందికి సూచించారు. శుక్రవారం పట్టణ పోలీసు స్టేషన్లో అన్ని రకాల బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థల మేనేజర్లతో సమావేశమై వారు తీసుకోవలసిన ముందస్తు జాగ్రత్తలపై వివరించారు. దొంగతనాలు జరగకుండా ముందస్తుగా తప్పనిసరిగా సిసి టీవీ కెమెరాలు ఏర్పాటు, సెక్యూరిటీ గార్డ్ ను నియమించుకోవాలని చెప్పారు. బ్యాంకు పరిసర ప్రాంతాల్లో, ఏటీఎం సెంటర్ల వద్ద తగిన లైటింగ్ ఉండేలా జాగ్రత్తలు పాటించాలని ముందస్తు ఎమర్జెన్సీ నంబర్లపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. చోరీలు, సైబర్ నేరాలను నివారించుటకు పోలీసు వారికి సహకరించాలని కోరారు.

హిందూపురం : హిందూపురం పట్టణ, పరిసర ప్రాంతాల్లోని బ్యాంకుల్లో తప్పనిసరిగా భద్రతా చర్యలు తీసుకోవాలని వన్ టౌన్ సీఐ రాజగోపాల్ నాయుడు సూచించారు. బ్యాంకుల్లో తీసుకుంటున్న భద్రతా చర్యలపై సమీక్ష సమావేశాన్నిశుక్రవారం స్థానిక వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ, ప్రతి బ్యాంకు లోను తప్పనిసరిగా అవసరమైన భద్రత ఏర్పాటు చేసుకోవాలన్నారు. పోలీస్ శాఖ పరంగా బ్యాంకర్లకు అవసరమైన సహకారాన్ని అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని సీఐ తెలిపారు. ఈ సమావేశంలో వివిధ బ్యాంకులకు సంబంధించిన మేనేజర్లు, అధికారులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ఓబుళదేవరచెరువు

మండల పరిధిలోని దిగువపల్లికి చెందిన వడ్డే జరిపిటి ప్రసాద్ అనారోగ్యంతో మృతిచెందాడు. ప్రసాద్ వైద్య చికిత్సల కోసం అతని కుటుంబం ఉన్న డబ్బులు ఖర్చుచేసింది. ఈ నేపథ్యంలో స్థానిక వడ్డెర సింఘం నాయకులు స్పందించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి తమ సానుభూతి ప్రకటించారు. అనంతరం రూ 16 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు డాక్టర్ జాకీర్ అహ్మద్, బాలకృష్ణారెడ్డి, సంఘాల శ్రీనివాసులతోపాటు వడ్డెర సంఘం మండల అధ్యక్షులు ఇడగుట్ట ఆంజనేయులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు అడ్వకేట్ మంజునాథ్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి దండగల చెన్నకేశవులు, గౌరవ సలహాదారులు కుంచెపు శ్రీనివాసులు, ఎంపీటీసీ శ్రీనివాసులు, వడ్డెరలు గంగులప్ప, ఆంజనేయులు, అన్నదాత రాజు, మస్తానమ్మ, చలపతి తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి - బుక్కపట్నం

వాహనదారులు పోలీసుల నియమ నిబంధనలు తప్పక పాటించాలని ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపారు. శుక్రవారం స్థానిక చౌడేశ్వరి దేవాలయం వద్ద వాహన తనిఖీ నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులు, ఆటోలు నిబంధనలు తప్పక పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటుపుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు

మండల పరిధిలోని మిట్టపల్లి జెడ్పి హైస్కూల్ విద్యార్థులకు టిడిపి నాయకుడు వాల్మీకి నాగమణి తన సొంత నిధులతో పెన్నులు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర పుట్టినరోజు సందర్భంగా వీటిని పంపిణీ చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు మునాఫ్, నాగేంద్ర, శ్రీనివాస్, సుధాకర, రవి, భాష తదితరులు పాల్గొన్నారు.

అర్చకుడి మృతికి కారకులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - కదిరి టౌన్

కర్నూలు జిల్లా ఊరుకుంద ఈరన్న స్వామి దేవస్థానంలో అర్చకుడిగా ఉన్న పూజన్న స్వామిని ఆలయ కార్యనిర్వహణాధికారి విజయరాజు వేదింపులకు గురిచేసి ఆత్మహత్యకు కారకుడయ్యాడని ఆయనపై సమగ్ర విచారణ చేసి కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య, శ్రీ ఖాద్రీ క్షేత్ర బ్రాహ్మణ సమైక్య సేవా సంఘం మరియు శ్రీ ఖాద్రీ క్షేత్ర బ్రాహ్మణ అర్చక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఖాద్రి లక్ష్మీ నరశింహ స్వామి దేవస్థానం ప్రధాన అర్చకులు కమారరాజా, ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి జి.శివరాం మాట్లాడుతూ ఆలయ ఈవో, ప్రధాన అర్చకులు, వేద పండిత్ లో వేదింపులు, అవమానాలు భరించలేక ఆత్మహత్య చేసుకున్న పూజన్న స్వామి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీ ఖాద్రీ క్షేత్ర బ్రాహ్మణ సమైక్య సేవా సంఘం, కదిరి అధ్యక్షులు బాబు ప్రకాష్, కార్యదర్శి శ్రీ పాపయ్య శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో 'కూటమి' విఫలం : వైసిపి

ప్రజాశక్తి-హిందూపురం

గత సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైసిపి మహిళ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చౌళూరు మధుమతి రెడ్డి, నాయకులు గుడ్డంపల్లి వేణు రెడ్డి విమర్శించారు. శుక్రవారం హిందూపురం రూరల్ మండల పరిధిలోని చలివెందుల, బీరేపల్లి, కగ్గల్లు పంచాయతీలలో వైసీపీ మండల కన్వీనర్ సి.రామాంజినప్ప ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో గతంలో టిడిపి, బిజెపి, జనసేన పార్టీలు ఇచ్చిన హామీలు, ప్రస్తుతం అమలు చేయడంలో నిర్లక్ష్యం అంశాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచులు, ఎంపీటీసీలు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మరకుంటపల్లిలో తాగునీటి కష్టాలు

ప్రజాశక్తి - కొత్తచెరువు రూరల్

మండల పరిధిలోని మరకుంటపల్లిలోని తలమర్ల ప్రధాన రహదారిలో గల కాలనీలో పది రోజులనుండి తాగునీటి సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈసందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ కొత్తచెరువు రోడ్డుకు పైపులైన్లు వేసి నీటి సరఫరా ప్రారంభించారని తలమర్ల రోడ్డుకు ఉన్న ఇళ్లకు తమ ప్రాంతానికి నీరు రావడం లేదని వాపోయారు. పంచాయతీ కార్యదర్శి ఇటీవల కొత్తచెరువు ప్రధాన రోడ్డుకు మాత్రమే పైప్‌లైన్ వేసి నీటి సరఫరా ప్రారంభించారనితలమర్ల రోడ్డు వైపు ఉన్న ఇళ్లకు నీటి కనెక్షన్ ఇప్పటికీ ఇవ్వలేదని విమర్శించారు. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి అశోక్ కుమార్‌ను అడిగితే సర్పంచుకు సమాచారమిచ్చామని పైపులైను వేస్తామని చెప్పారన్నారు. అయితే పది రోజులు గడిచినా పంచాయతీ కార్యదర్శి నీటి సమస్యపై స్పందించలేదని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పక్క కాలనీకి నీళ్లు వస్తున్నాయని తమకు మాత్రం రావడం లేదని వాపోయారు.